నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం | 03 ఏప్రిల్ 2025 | పేజీలు 8


# ఏపీకి నూతన రైల్వే ప్రాజెక్టులు కేటాయించారా ?



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు లోక్‌సభలో బుధవారం వివిధ అంశాలపై ఆయన ప్రశ్నలు వేశారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన, నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టుల వివరాలు, ప్రస్తుతం వాటి స్థితి తెలియజేయాలన్నారు. అలాగే నూతనంగా కేటాయించబడిన, మంజూరు చేయబడిన, వినియోగించబడిన మొత్తం నిధుల వివరాలు ఆరా తీశారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ప్రణాళికలు

-మిగతా 2లో



# నీరు కన్నీరు

జిల్లాలోని మెట్ట రైతాంగాన్ని ప్రస్తుత ఏడాది చితికేసింది. వరుణుడు కరుణించకపోవడంతో వర్షాధారం మీదే ఆధారపడి పంటలు సాగు చేస్తున్న మెట్ట రైతులకు ప్రస్తుతం సాగునీరు గగనమై పడరాని పాట్లు పడుతున్నారు. ఫలితంగా మెట్ట పంటలు నిలువునా ఎండి దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ బోర్ల ద్వారా సాగునీరును పంటలకు అందించాలంటే పెట్టుబడులు రెట్టింపు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలు అయోమయంలో మునిగి తేలుతున్నారు.

**మర్రిపాడు మేజర్‌న్యూస్ :**

- గగనమైన సాగునీరు
- నిలువునా ఎండుతున్న మెట్ట పంటలు
- రెట్టింపు అవుతున్న పెట్టుబడులు
- అయోమయంలో అన్నదాతలు

జిల్లాలోని మెట్ట రైతు ల అగమ్యగోచరంగా తయా రైంది. మెట్ట పంటలను సాగు చేస్తున్న తరుణంలో సాగునీరు గగనమై అల్లాడిపోతు న్నారు. జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో ఉండే మండలాల్లో ప్రధానంగా వరి, మిరప, సజ్జ, మొక్కజొన్న, పొగాకు, నిమ్మ తదితర పంటలతో పాటు కూరగాయల సాగును కూడా రైతులు వేల ఎకరాల్లో చేపట్టడం జరిగింది. అయితే ఈ పంటలకు ప్రస్తుత ఏడాది సాగు నీరు అందించడం రైతులకు భగీరథయత్నంగా మారింది. రాష్ట్రంలో మూడు తుఫాన్లు నమోదైనప్పటికీ వరుణుడు మెట్ట రైతాంగాన్ని మాత్రం మరిచాడు అని చెప్పడానికి ఇదొక నిదర్శనం. ఆ తుఫానుల కారణంగా కనీసం చెరువుల్లోకి చారెడు నీరు కూడా రాకపోవడంతో ఎటువంటి జల వనరులు లేని మెట్ట మండలాల రైతుల పరిస్థితి దారుణంగా మారింది. దీంతో సాగు చేసిన పంటలను దక్కించుకోవడం రైతులకు కష్టతరమైంది. కొంతమంది రైతులు వ్యవసాయ బోర్ల ద్వారా కిలోమీటర్ల పొడవున పైపులు ఏర్పాటు చేసి పంటలకు సాగునీరు అందిస్తున్నారు. మరి కొంతమంది రైతులు డ్రిప్పు ద్వారా కొన్ని పంటలను కాపాడుకుంటున్నారు. మరి కొంతమంది రైతులు పంటలకు సాగునీరు అందించలేక పూర్తిగా వదిలేసిన పరిస్థితి కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా నీరు పంటలకు అందిస్తున్న కొన్ని పంటలకు ఆ నీరు సరిపోకపోవడంతో ఎదుగుదల లేక నష్టానికి గురి చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ముసురు కారణంగా పంటలన్నీ తెగుళ్లు బారినపడి నాశనమయ్యాయి. ఈ తరుణంలో రైతులు నానా తంటాలు పడి పలు పురుగు మందులు వాడి వాటిని అదుపులోకి తీసుకొచ్చిన తరుణంలో సాగునీరు గగనం అవడంతో ఆ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఒక్క పొగాకు పంటను పరిగణలోకి తీసుకుంటే కూలీల ఖర్చు కూడా విపరీతంగా పెరిగి రైతుకు పెట్టుబడులు రెట్టింపయ్యేలా చేస్తున్నాయి. ఉదాహరణకు పొగాకు పంటకు నీళ్లు అందించేందుకు ఒక కూలి ఖర్చు

-మిగతా 2లో

### భారత ఉప రాష్ట్రపతిని కలిసిన

# బీద మస్తాన్‌రావు యాదవ్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌తో తెలుగుదేశం పార్టీ నాయకులు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ బుధవారం పార్లమెంటులో ఉప రాష్ట్రపతి కార్యాలయంలో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలయ్యే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు యొక్క పురోగతి, అమరావతిలో అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి కొత్తగా ప్రారంభించిన "పి4 మోడల్ మార్గదర్శి - బంగారు కుటుంబం" కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికత, పరిపాలన దక్షత కలిగిన నాయకుడని, ఆయన పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని ఉప రాష్ట్రపతి అన్నారు. ఉపరాష్ట్రపతి ఇచ్చిన సూచనలకు బీద మస్తాన్‌రావు యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

### అసంపూర్తి ఫిషింగ్ జెట్టి

# నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :**



అసంపూర్తిగా మిగిలి ఉన్న మినీ ఫిషింగ్ జెట్టి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నేలటూరు పాలెం గ్రామానికి విచ్చేసి అక్కడ మినీ ఫిషింగ్ జెట్టిని పరిశీలించారు. ఎమ్మెల్యే బోటు ఎక్కి బ్రేక్ వాటర్ వద్ద పనులను చూశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులు వావిళ్ళ జనార్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానికులు ఇచ్చిన అర్జీలను

# చిల్డ్రన్స్ పార్కులో మెరుగైన వసతులకు చర్యలు





## కమిషనర్ సూర్యతేజ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోని స్థానిక చిల్డ్రన్స్ పార్కులో మరింత మెరుగైన వసతులను కల్పించి, పార్కును సందర్శించే వారికి పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ సూర్యతేజ తెలియజేశారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక చిల్డ్రన్స్ పార్కును కమిషనర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పార్కులో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించనున్నామని తెలిపారు. పార్కుకు విచ్చేసే సందర్శకులకు అవసరమైన మరుగుదొడ్లు, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించామని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా జిమ్ పరికరాలు, షటిల్, ఇతర క్రీడా సౌకర్యాలను ప్రత్యేక ప్రాంగణంలో కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలో ఎక్కువ సంఖ్యలో సందర్శకులు విచ్చేసే చిల్డ్రన్స్ పార్కులో అన్ని రకాల మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించడంతోపాటు, ప్రతిరోజు వ్యాయామం కోసం వస్తున్న వాకర్స్ కోసం ప్రత్యేక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, పార్కును పరిశుభ్రంగా ఉంచేలా వాకర్స్ అసోసియేషన్ సహకరించాలని కమిషనర్ వారికి సూచించారు. విధులలో అలసత్వం వహించిన సంభంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ హెచ్చరించారు. పార్కులో పచ్చదనం, మొక్కల పెంపకం, వాకింగ్ ట్రాక్, ఫౌంటైన్‌లు, విద్యుత్ దీపాలు, క్రీడా వస్తువులు, వ్యాయామ పరికరాలు, చిన్నపిల్లలకు ఆటవిడుపు వస్తువులు, బెంచీలు, మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాలను కమిషనర్ పరిశీలించి అవసరమైన మేరకు నూతన వాటిని అమర్చాలని, మరమ్మతు చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్య అన్నదానానికి రూ.60 వేలు విరాళం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి, స్వప్న దంపతులు శ్రీవార్ల నిత్య అన్నదానానికి రూ.60 వేలు విరాళంగా దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు శ్రీవార్ల దర్శనం కల్పించి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల శేష వస్త్రం, కుంకుమ, తీర్ధ ప్రసాదాలు దాతలకు అందజేశారు.





## నీరు.. కన్నీరు !

*(మొదటి పేజీ తరువాయి)*

రోజుకి రూ.1200 అవుతుందని రైతులు వాపోతున్నారు. ఇలా పంటలకు పెట్టుబడులే అధికమవుతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో మెట్ట రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. కొన్ని ప్రాంతాల్లో వరి పంట చేతికి అందినప్పటికీ తగు దిగుబడి కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. ఇది ఇలా ఉంటే మిరప పంట పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి పండిం చిన మిరపకు గిట్టుబాటు ధర లేక పంటనే పూర్తిగా వదిలేశారు. దీనికి తోడు సాగునీరు కూడా గగనం అవడంతో రైతులకు మరో దిక్కు తోచలేదు. ఈ విధంగా ప్రస్తుత ఏడాది వరుణుడు కరుణించకపోవడంతో పంటలను పండించేందుకు మెట్ట రైతులు భగీరథ యత్నాలు చేయక తప్పలేదు. ఆ భగీరథ యత్నాలు కూడా చేయలేని రైతులు పంటలను వదిలేశారు. ఈ విధంగా మెట్ట రైతులు సాగు చేసుకున్న పంటలు కళ్ళ ఎదుటే ఎండిపోతుంటే చూసి ఉండిపోవడం తప్ప మరో దారి కనిపించడం లేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీకి నూతన రైల్వే ప్రాజెక్టులు కేటాయించారా ?

*(మొదటి పేజీ తరువాయి)*

ఉన్నాయా.. అని వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ సమాధానమిచ్చారు. రైల్వే ప్రాజెక్టుల కేటాయింపు రాష్ట్రాలు, జిల్లాలవారీగా ఉండదని, రైల్వే జోన్ల వారీగా ఉంటుందన్నారు. రైల్వే ప్రాజెక్టులు చేపట్టడం అనేది దాని వ్యయం, కనెక్టివిటి, ప్రత్యామ్నాయ మార్గాలు, రద్దీ, మార్గాల పెంపుదల, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, పార్లమెంటు సభ్యుడు, ఇతర ప్రజాప్రతినిధులు లేవనెత్తిన డిమాండ్లు, రైల్వే సొంత కార్యాచరణ అవసరాలు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు వంటి వాటిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే, నైరుతి రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ల పరిధిలోకి వస్తుందన్నారు. రైల్వే జోన్ల వారీగా ప్రాజెక్టుల వివరాలు, వాటి ఖర్చు భారతీయ రైల్వే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ జోన్ల పరిధిలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి, మొత్తం 5,329 కిలోమీటర్ల పొడవును కవర్ చేస్తూ.. 73,743 కోట్ల విలువైన 41 రైల్వే ప్రాజెక్టులు (17 కొత్త లైన్లు, 24 డబ్లింగ్) ప్రణాళిక/ఆమోదం/అమలు దశలో ఉన్నాయన్నారు. వీటిల్లో 1006 కిలోమీటర్ల పొడవున రూ.24,150 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. అలాగే 6764 కిలోమీటర్ల గల 65 సర్వేలు (13 కొత్తలైన్, 52 డబ్లింగ్) గత మూడేళ్లలో అంటే 2021-22, 2022-23, 2023-24, ప్రస్తుత సంవత్సరం 2024-25లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినట్లు చెప్పారు. 2014 నుంచి భారతీయ రైల్వేలకు నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2009-2014 మధ్య రైల్వేలకు సంవత్సరానికి రూ.886 కోట్లు కేటాయిస్తే.. 2025-26 సంవత్సరానికే ఆంధ్రప్రదేశ్‌కు రూ.9417 కోట్ల విలువైన ప్రాజెక్టుకు కేటాయించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, అటవీ క్లియరెన్స్, అనుమతులు, భౌగోళిక పరిస్థితులు, ప్రాజెక్ట్/స్థలం ప్రాంతంలో శాంతిభద్రతల పరిస్థితి, పని సమయం, నిర్దిష్ట ప్రాజెక్ట్ కోసం పనిచేసే సమయం వంటి అంశాలు ఇక రైల్వే ప్రాజెక్టుల పూర్తి అనేది ఆధారపడి ఉంటుందన్నారు. వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు జోనల్ రైల్వేలు, ఇండియన్ రైల్వే సామాజిక మాధ్యమాల్లో ఉంచబడుతుందన్నారు.

### అసంపూర్తి ఫిషింగ్ జెట్టి

## నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

*(మొదటి పేజీ తరువాయి)*

ఎమ్మెల్యే సోమిరెడ్డి తీసుకొని పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా గ్రామానికి వచ్చే రోడ్డు మార్గం అధ్వానంగా ఉండడంతో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సీఎస్ఆర్ నిధుల ద్వారా పనులు చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న జెట్టి నిర్మాణ పనులకు మరో 15 కోట్ల రూపాయలు అవసరమైనందున ఆంధ్రప్రదేశ్ మారిటోరియం బోర్డుతో మాట్లాడి పనులు చేసే విధంగా చూస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా ఓడరేవులు శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికా రులను తీసుకువచ్చి చూపిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కృష్ణపట్నం గ్రామ మత్స్యకారులు ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. కృష్ణపట్నం వద్ద ఫిషింగ్ జెట్టి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తప్పనిసరిగా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు మునుకూరు రవికుమార్ రెడ్డి, ఈదురు రామ్మోహన్ రెడ్డి, వై.కోదండ రామయ్య, పార్టీ జనరల్ సెక్రెటరీ నీలం మల్లికార్జున్ యాదవ్, తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు రాగాల శివకృష్ణ, జాతీయ మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ షఫీ ఉల్లా, నియోజకవర్గ తెలుగు యువత కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి దండు శ్రీనివాసులు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పెదకాల కాంతారావు, దళిత నాయకులు పట్టపు శోభన్ బాబు, ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ కాపులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మైనింగ్ కేసులో..

## కాకాణి పేరు చేర్చడం విడ్డూరం

**వైసీపీ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్ మల్లి నిర్మల**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నిబద్ధత గల నాయకుడు కాకాణి పేరును అక్రమ మైనింగ్ కేసులో చేర్చడం విడ్డూరంగా ఉందని వైఎస్ ఆర్‌సీపీ స్టేట్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్ మల్లి నిర్మల ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత పది రోజులుగా అక్రమ మైనింగ్‌కు సంబంధించి మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న కక్ష్య సాధింపు చర్యలు పూర్తిగా ఆధారాలు లేనివని వివరించారు. ఒకసారి జడ్పీ ఛైర్మన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా ప్రజలకు సేవ చేయడంతో పాటు పార్టీ బాధ్యతలను నిరంతరం నిబద్ధతతో చేసే కాకాణి అన్నపై అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన పోరాట పటిమను తట్టుకోలేక అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురిచేయడానికే ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. గతంలో తమ నాయకుడు కాకాణి మంత్రిగా ఉన్నప్పుడు అక్రమ మైనింగ్‌పై విచారణ చేయాలని ఆదేశించారన్నారు. అప్పటి అధికారులు విచారణ జరిపి నివేదికను అందచేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపిం చిన ఆయనపై తప్పుడు కేసులు బనాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ సంబంధం లేకుండా కేవలం అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేధింపులకు గురి చేయడం టీడీపీ నాయకులకు అలవాటేనని తెలిపారు. 2003లో ఒక పెద్ద మనిషి మంత్రిగా ఉండి ఒక శాసన సభ్యుడితో కలిసి అక్రమ మైనింగ్ చేసిన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. అప్పటి జిల్లా అటవీ శాఖాధికారి స్వయంగా వాహనాలను సీజ్ చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. అధికార పార్టీలో ఉండి ఒక బీసీ వర్గానికి చెందిన ఆ అటవీ శాఖాధికారిని టార్గెట్ చేసి అక్రమ బదిలీ చేశారని తెలిపారు. అప్పట్లో బీసీ నాయకులు మూడు రోజులు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేసిన సంఘటనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మంత్రిగాఉండి అక్రమాలకు పాల్పడిన ఆయన మంచివాడా... ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తూ తాను మంత్రిగా ఉన్నప్పుడు అక్రమ మైనింగ్ పై విచారణ జరిపించిన కాకాణి మంచివాడా ఎవరు మంచివారు అని ప్రజలకు తెలుసన్నారు.

# వడదెబ్బపై జాగ్రత్తలు వహించాలి

## విశ్రాంత డిఎం అండ్ హెచ్ఓ కె.మాశిలామణి




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం ఉగాది వచ్చి రాకముందే వేసవి తీవ్రత పెరిగిపోతుంది. ఈ వేసవిలో ప్రజలు చాలా జాగ్రత్తగా వహించాల్సి ఉంటుందని లేనియెడల తీవ్ర అనారోగ్యానికి గురవుతారని విశ్రాంత డిఎం అండ్ హెచ్ఓ కె.మాశిలమని తెలిపారు. వడదెబ్బ బారిన పడితే ఎంతో బాధపడాల్సి వస్తుందని తెలిపారు.

**వడదెబ్బ లక్షణాలు :** వడదెబ్బ సోకినవ్యక్తికి తీవ్రమైన తలనొప్పి తీవ్రమైన జ్వరం కలిగి ఉండడం మత్తు నిద్ర కలవరింతలు ఫిట్స్ పాక్షికా లేదా పూర్తి అపస్మారక స్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యుని సంప్రదించాలన్నారు.

**వేసవిలో చేయాల్సిన పనులు :** తెలుపు రంగు దుస్తులను ధరించాలని తలకు టోపీ లేదా రుమాలు కట్టుకోవాలని ఉప్పు లేదా గ్లూకోస్ తెలిపిన నీటిని త్రాగాలన్నారు వ్యక్తికి ఏడ ఉన్న చల్లటి ప్రదేశంలో ఉంచి తడి గుడ్డతో శరీరం అంత రుద్దుతూ ఉండాలి వయసు నీటిలో ముంచిన గుడ్డతో శరీరం అంత తుడవాలి శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల వరకు వచ్చేవరకు ఐస్ వాటర్ గుడ్డతో తుడుస్తూ ఉండాలి వడదెబ్బకు గురైన వారి సాధారణ స్థితికి రాణిచో వారిని శీతల వాతావరణంలో ఉంచి దగ్గరలోని ప్రాథమిక వైద్యశాలకు తరలించాలి మంచినీటిని ఎక్కువసార్లు త్రాగాలి ఎండలో నుండి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం గాని కొబ్బరినీరు గాని లేదా చల్లనీరు గాని త్రాగాలి ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు త్రాగాలి తీవ్రమని ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరుగుట మొదలైన అనారోగ్యం ఏర్పడితే దగ్గర్లోని వైద్యులు సంప్రదించి ప్రాథమిక చికిత్స తీసుకోవాలి వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు.

**ఎండ సమయంలో చేయకూడనివి :** సూర్యకిరణాలు వేడిగాలి గురికాకుండా వేడిగా ఉన్న సూర్యకిరణాలలో తిరగరాదు వేసవి కాలంలో నలుపు దుస్తులు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. నెత్తికి టోపీలేక రుమాలు లేకుండా ఎండలో తిరగరాదు వడదెబ్బకు గురైన వారిని వేడి నీటిలో ముంచిన గుడ్డతో తొడవరాదు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చేర్చుటలో ఏమాత్రం ఆలస్యం చేయరాదు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల లోపు ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. ఎండలో బయట నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె తీసుకోకూడదు. మంచు ముక్కలు వంటివి తీసుకున్నట్లయితే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున వడదెబ్బ బారిన పడినట్లయితే వెంటనే వైద్యుని సంప్రదించి తగిన చికిత్స పొందాలని తెలిపారు.

## సోము వీర్రాజును సత్కరించిన

# భరత్ కుమార్ యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ సీనియర్ పూర్వపు అధ్యక్షుడు సొమ్ము వీరరాజు బుధవారం విజయవాడలో శాసన మండలి సభ్యుడుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆయనను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.భరత్ కుమార్ యాదవ్ కలిసి సత్కరించారించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## యాదవ కార్పొరేషన్ ఛైర్మను సన్మానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహాయాదవ్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నరసింహాయాదవ్ ప్రమాణస్వీకార మహోత్సవంలో వారు పాల్గొని సన్మానించారు. రాష్ట్రంలో యాదవుల సంక్షేమానికి కృషి చేయాలని చైర్మన్ను కోరినట్లు వారు తెలిపారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి నివాళి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని కంసాలివీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కల్లూరి నారాయణరెడ్డి మృతికి మండల యూటీఎఫ్ శాఖ బుధవారం నివాళులర్పించింది. అనారోగ్యంతో నారాయణరెడ్డి మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్రెడ్డి, దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, ఏడుకొండలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత్వ సంపుటి 'మారకనే మారానంటాడు' ఆవిష్కరణ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాస రావు తన ఛాంబర్‌లో ప్రముఖ చరిత్రకారుడు, రాజనీతి శాస్త్ర ఆచార్యుడు, కవి కాంజీవరం రాధాకృష్ణ రచించిన కవిత్వ సంపుటి 'మారకనే మారానంటాడు'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 87 ఏళ్లుగా తన భావాలను కవిత్వంగా వ్యక్తం చేసిన రాధాకృష్ణ అభినందనీయులని, సామాజిక అసమానతలను ప్రతిబింబించిన ఈ కవిత్వ సంపుటిని అందరూ చదవాలని సూచించారు. తెలుగు అధ్యయన ఆచార్యులు డాక్టర్ సి.రాజా రామ్ ఈ కవిత్వం సమాజానికి యథార్థ ప్రతిబింబమని పేర్కొనగా, డాక్టర్ కె.సునీత సామాజిక సమస్యలను కవిత్వ రూపంలో ప్రస్తావించడం ద్వారా సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. డాక్టర్ కే.లక్ష్మీనారాయణరెడ్డి ఈ కవిత్వం భావితరాలకు సైతం ఆదర్శనీయమవుతుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, పాలిటెక్నిక్ కళాశాల ఆచార్యులు ఆకుపాటి సుధీర్, విశ్రాంత తెలుగు ఆచార్యులు కంచి నీరద, హైకోర్టు న్యాయవాది, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ లెనిన్ ధనిసెటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవి కాంజీవరం రాధాకృష్ణ తన కవితలను స్వయంగా చదివి వినిపించారు.

# కావలి మున్సిపాలిటీ ఆస్తి పన్నుల వసూళ్లలో బేష్

## కమిషనర్ జి.శ్రావణ్ కుమార్




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో 2023-24 ఆర్థిక సంవత్సరం కాను 2024-25లో ఆస్తి పన్నుల వసూళ్ల కార్యక్రమంలో రికార్డు బ్రేక్ చేసిన కావలి మున్సిపల్ అధికారులు అని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 15800 లక్షల రూపాయలు అధికముగా వసూలు చేయడం జరిగిందని, అలాగే వడ్డీ 50శాతం ప్రభుత్వం తగ్గించిన తర్వాత నుండి అంటే మార్చి 26 నుండి 31 వరకు సుమారు ఒక కోటి 26 లక్షల రూపాయలు వసూలు కాబడిందని తెలిపారు. ఇంటి పన్ను వసూళ్ళ కార్యక్రమంలో కావలి మున్సిపాలిటీ చాలా ఆధిక్యతతో ఉందని తెలిపారు. అలాగే పన్ను వసూల కార్యక్రమంలో శ్రమించి పనిచేసిన రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఫణి కుమార్ అలాగే ఆరేళ్ల ఎన్.సురేంద్ర, షేక్. షఫీలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బందిని కూడా అభినందించారు. కావలి అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించినందుకు వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గ్రామ పంచాయతీ కార్యాలయము బ్రాహ్మణ క్రాక
## జలదంకి మండలం, నెల్లూరు జిల్లా

**ఆర్.ఓ.సి.నెం. 04/2025** టెండరు ప్రకటన **తేది. 04-03-2025**

నెల్లూరు జిల్లా జలదంకి మండలము, బ్రాహ్మణక్రాక గ్రామ పంచాయతీ నందు తేది 01.04.2025 నుండి 31.03.2026 వరకు అనగా ఒక్క సంవత్సర కాలమునకు ఈ దిగువ తెలిపిన పనులకు సిబ్బందిని సరఫరా చేయుటకు తేది 09.04-2025 ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నాం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నాం 2.00 గంటలకు హాజరు అయిన టెండర్లదారుల సమక్షంలో తెరువబడును. టెండరు దాఖ లు చేయు వారు దిగువ తెలిపిన మొత్తంను టెండరు ధరావత్తుగా చెల్లించి రశీదును టెండరు ధరఖాస్తుకు జతపరచి దాఖలు చేయవలెను. ఇతర పూర్తి వివరములకు గ్రామపంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

| వరుస సంఖ్య | వివరములు | సంఖ్య | కాలపరిమితి | ధరావత్తు మొత్తము |
|---|---|---|---|---|
| 1 | పీడబ్ల్యూఎస్ స్కీములకు ఆపరేటర్‌గా చేయుటకు | 3 ముగ్గురు | తేదీ 01.04.2025 నుండి తేదీ 31.03.2025 వరకు | రూ. 5000.00 అయిదు వేలు రుపాయలు |
| 2 | వీధి విద్యుత్ దీపములు మరమ్మత్తులు చేయుటకు | 2 ఇద్దరు | తేదీ 01.04.2025 నుండి తేదీ 31.03.2025 వరకు | |
| 3 | వీధి దీపములు నిర్వహణకు హెల్పర్ (నిచ్చేన వేయుట మొదలగు) పని చేయుట పోస్టు 1కి నెలకు రేటు విడివిడిగా చూపవలెను. | 1 ఒక్కరు | తేదీ 01.04.2025 నుండి తేదీ 31.03.2025 వరకు | |

నిబంధనలు : 1) పంచాయితీ కార్యదర్శి టెండరు రద్దు చేయుటకు అమలు పరుచుటకు పూర్తి అధికారము కలదు. 2) పంచాయితీ నిధుల సౌలభ్యమును బట్టి జిల్లా పంచాయితి అధికారి అనుమతి పొందిన తదుపరి మాత్రమే బిల్లులను చెల్లించబడును. బిల్లుల జాప్యమునకు ఎటువంటి వడ్డీ చెల్లించబడదు. 3) కాంట్రాక్టు సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బందిగా పరిగణించరు. 4. టెండరు దాఖలు చేయువారు, వారు సూచించిన రేట్ల ప్రకారం కాలపరిమితి వరకు సరపర చేయు గలవారము అని 100 స్టాంపు పేపరు పైన అగ్రిమెంటు దాఖలు చేయవలెను. అగ్రిమెంటు లేనియెడల టెండరు అంగీకరించబడదు. 5. టెండరు అంగీకరించని వారి టెండరు ధరావత్తును. కలెక్టర్ గారి ఉత్తరాలు వచ్చిన పిరద చెల్లించ బడును.

**పంచాయితీ కార్యదర్శి,**
**సం/-బ్రాహ్మణత్రిక గ్రామ పంచాయితీ, జలదంకి మండలం, నెల్లూరు జిల్లా,**

ఏపీఎస్ ఆర్టీసీ హాస్పిటల్స్‌లో..

# ఆయుష్ వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి

## బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ మహేంద్ర యాదవ్ వినతి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండే అన్ని ఆర్టీసీ హాస్పిటల్‌లలో ఆయుష్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొని రావాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి వర్యులు రాంప్రసాద్ రెడ్డిని బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ మహేంద్ర యాదవ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుష్ వైద్యం ద్వారా ఉపశమనం లభిస్తుందని, రాష్టం వ్యాప్తంగా ఉండే అన్ని ఆర్టీసీ హాస్పిటల్లలో ఆయుష్ డాక్టర్ల ద్వారా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని మహేంద్ర యాదవ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం అన్ని అల్లోపతి హాస్పిటల్స్‌లో ఆయుష్ వైద్యాన్ని అనుబంధ సేవలనుగా చేర్చి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తుందని.. అదేవిధంగా రాష్టంలో ఆర్టీసీ హాస్పిటల్స్‌లో ఆయుష్ వైద్య సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా చాలా మంది ఆయుష్ వైద్యం చదివిన డాక్టర్లకు ఉద్యోగాలు రావడం వల్ల నిరుద్యోగ సమస్య తగ్గి ప్రజలకు సైడ్ ఎఫెక్ట్స్ లేని నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని అభిప్రాయపడ్డారు. మంత్రి కూడా ఈ ప్రతిపాదన మీద సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# ఆటిజం వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

## సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆటిజం వ్యాధిపై అవగాహన పెంచుకొని పిల్లలను సంరక్షించుకోవాలని సామాజికవేత్త మాలకొండ రెడ్డి కోరినారు బిడ్డ పుట్టినప్పట్నుంచీ ప్రతీరోజూ ఏదో ఓ కొత్త విషయం నేర్చుకుంటారు. పాకడం, నిలబడడం, బోర్లా పడడం ఇలా ప్రతీది తల్లిదండ్రులకి ముచ్చటే. కానీ, కొంతమందిలో అలాంటి లక్షణాలు కనిపించవు.. అందరి పిల్లల్లా వారు యాక్టివ్‌గా ఉండరు. ఓ మూలన ఉంటారు. బాధపడుతుంటారు. దీనికి కారణం ఆటిజమ్ అయి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు ఏడాది లోపు నుంచే కనబడినా నాలుగేళ్ల వరకూ మనం గుర్తించలేం. ఈ సమయంలో వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. శిశువుకు 3నెలలు వచ్చినప్పటి నుంచే తల్లిని గుర్తుపడతారు. చూపుతో చూపు కలుపుతారు. కళ్లలో కళ్లు పెట్టి నవ్వితే నవ్వుతారు. అయితే 'ఆటిజం' పిల్లల్లో చూపు మామూలుగానే ఉంటుంది కానీ తల్లిదండ్రులను గుర్తుపట్టలేరు. వినికిడి సాధారణంగానే ఉంటుంది. కానీ పేరు పెట్టి పిలిస్తే మన వైపు చూడరు. 'ఆటిజం'లో ఇదొక ప్రధాన లక్షణం. మన దేశంలో దాదాపు 2 శాతం పిల్లలు ఈ రకమైనజబ్బుతో బాధపడుతున్నారు. చిన్నారుల్లో మానసిక ఎదుగుదల లోపం తల్లిదండ్రులకు శాపంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, ఆటిజం అనేది మెదడు అభివృద్ధిని ప్రభావితం చేసే రుగ్మతల్లో ఒకటి. ఇది అనేక రకాల లక్షణాల ద్వారా బయటపడుతుంది. నిద్రలేమి, స్వీయ-గాయాల వంటి సమస్యాత్మక ప్రవర్తనలతో పాటు, ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తులు తరచుగా మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్యాక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలను కలిగి ఉంటారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఏప్రిల్ 2వ తేదీని అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినంగా ప్రకటించింది. పిల్లల్లో మంద బుద్ధి నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ ఆటిజం అవగాహనా దినం నిర్వహిస్తున్నారు. 2007వ సంవత్సరం డిసెంబర్ 18వ తేదీన ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు 2008వ సంవత్సరం నుంచి ఏటా ఏప్రిల్ 2వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతి వంద మందిలో ఒక్కరు ఈ సమస్యతో బాధ పడుతున్నట్లు తెలిపింది. మగ పిల్లల్లోనే ఈ సమస్య ఎక్కువగా ఉందని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 2025 ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం యొక్క థీమ్ 'నాడీ వైవిధ్యాన్ని అభివృద్ధి చేయడం'. ఈ సంవత్సరం ఎజెండా ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తుల సమస్యలను వినడం, అర్థం చేసుకోవడం, వారి నుండి నేర్చుకోవడం మరియు వారి జీవితాలను మరింత మెరుగు పర్చడం వంటి విషయాలపై దృష్టి పెడుతుంది. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలను దూరంగా వుంచ కూడదు. వారిని అర్థం చేసుకోవాలి. వ్యాధి తొలి దశలో గుర్తిస్తే చికిత్స సాధ్యమే నని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పౌర సంస్థలు ఆరోగ్య శాఖ ప్రజాప్రతినిధులు ఆటిజం వ్యాధిపై ప్రజలను మేలుకొలిపి పిల్లలను ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు కృషి చేయాలని సామాజికవేత్త మాలకొండ రెడ్డి కోరారు.

ఉగాది ఉత్తమ పురస్కారం అందుకున్న

# పశు వైద్యాధికారి తహ అన్సారి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** విజయవాడలో ఉగాది పురస్కార మహోత్సవాలు పురస్కరించుకొని ఏఎస్ పేట మండల పశువైద్యాధికారి షేక్. తహ అన్సారి, ఉత్తమ పశు వైద్యులు అవార్డు అందుకున్నారు. ఆయన పశుసంవర్ధక శాఖ రంగంలో ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా విజయవాడలో ఏపీ పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ దామోదర్ నాయుడు, చేతుల మీదగా ప్రసంశా పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా తహ అన్సారీ మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. తాను చేసిన సేవలకు ఏపీ పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకోవడం చెప్పలేనంత ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ అవార్డు రావడానికి కారణమైన తోటి సిబ్బందికి, మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అన్సారికి తోటి సిబ్బందితోపాటు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీడీ బాధ్యతల స్వీకరణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉదయగిరి క్లస్టర్ ఏపీడీగా ఎం.మృదుల బుధవారం బాధ్యతల స్వీకరించారు. కోవూర క్లస్టర్ ఏపీడీగా విదులు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయగిరి ఏపీడీగా ఉన్నతాధికారులు నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల ఏపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

# రెండో పంటకు నీటివేడుక

## ఐఏబీ సమావేశం తక్షణమే నిర్వహించాలి : సోమిరెడ్డి




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో రెండో పంటకు నీటి కేటాయింపులు చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ మంత్రి, కలెక్టర్‌కు లేఖ రాసి, వెంటనే ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబి) సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ప్రధాన సాగునీటి వనరులైన సోమశిల, కండలేరు జలాశయా ల్లో కలిపి 100టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. డెడ్ స్టోరేజీ, తాగునీటి, పారిశ్రామిక అవసరాలకు తప్పించి 60 టీఎంసీలకు పైగా నీరు నిల్వగా ఉంది. ఈ నీటిని వినియోగించి రైతులకు రెండో పంటసాగు చేయించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధి దృష్ట్యా ఆలస్యం లేకుండా ప్రభుత్వం స్పందించాలని కోరుతూ, ఐఏబీ సమావేశం నిర్వహించాలని సోమిరెడ్డి హితవు పలికారు.

ఆధార్ క్యాంపులను..

# సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీఓ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయలలిత పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గ్రామ సచివాలయాల్లో ఏప్రిల్ 3వతేదీ నుంచి 11వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌ను ప్రారంభించనున్నారు. పాడేరు, యనమదాల, నాగులవెల్లటూరు, ఏప్రిల్ 2వతేదీ నుంచి 5వతేదీ వరకు పెరుమాళ్ళపాడు, కోటితీర్థం, నేర్నూరు ఈనెల 8నుంచి 11వ తేదీ వరకు సచివాలయాల పరిధిలోని ప్రజలు హాజరై ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఆధార్ లేని చిన్న పిల్లలకు కొత్తగ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

# స్వచ్ఛ్ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ పరిసర ప్రాంతాలు స్వచ్ఛ దివాస్, స్వచ్ఛ ఆంధ్రగా ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మున్సిపాలిటీ స్వచ్ఛందంగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించిన ఎన్‌డిఏ ప్రభుత్వ, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలి పట్టణ మున్సిపల్ పరిధిలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అక్కడి ప్రదేశాన్ని మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేసి అక్కడ అపరిశుభ్రంగా ఉండకుండా ఒక స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు మున్సిపాలిటీ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అలాగే అంబేద్కర్ పార్కు కూడా శుభ్రపరచడం జరిగింది. అనంతరం కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, కావలి ఏరియా వైద్యశాల కమిటీ వారు ఈ ప్రదేశానికి రావడం అక్కడ ప్రాంతాన్ని పరిశీలించి మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ సిబ్బంది చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

## అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వీ.సత్రం మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బిరుదోలు హరిబాబు (36) తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై మృతుడి భార్య బిరుదోలు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఆమ్మో.. ఆ హెల్త్ అసిస్టెంటా.!

# పెద్ద వసూల్ రాజ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ప్రతిరోజు ఏదో ఒక సమస్య తీసుకొస్తున్న అధికారి ఎండి షరీఫ్. వీరి ఉద్యోగం కావలి మున్సిపాలిటీలో హెల్త్ అసిస్టెంట్ ప్రతిరోజూ ఉదయాన్నే కూరగాయల మార్కెట్లు, రైతు బజారు ముందు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్న స్ట్రీట్ వ్యాపారస్తులపై ఇతను ప్రతాపం చూపుతూ, దౌర్జన్యాలు నిర్వహిస్తుంటారు. అక్కడ అమ్ముకుని జీవనం సాగిస్తున్న ప్రజానీకం ఇతనిపై ఫిర్యాదు చేయాలంటే వారు భయపడతారు. ఒక వేళ ఫిర్యాదు చేసినప్పటికీ అతని మీద, తను చేయుచున్న ఆగడాలు ఆగు తాయ అనుకుంటే అది నిజంకాదు.. తను ఉద్యోగంలోకి వచ్చినప్పటి నుంచి కావలి పట్టణంలో వ్యాపారస్తులపై చిరు వ్యాపారస్తులపై తన ప్రతాపాన్ని చూపుతూ వచ్చారు. అయితే మంగళవారం రాత్రి జరిగిన సంఘటన మనం పరిశీలిస్తే ప్లాస్టిక్ కవర్లో నియంత్రణలో భాగంగా కావలి పట్టణ వ్యాపారస్తులు ప్రభుత్వ ఆదేశాలను అందించారు. ప్లాస్టిక్ వాడకూడదు అని, అయితే ఎక్కడో కొద్దిగా మిగిలిపోయిన వాటిని అదునుగా చూసుకొని హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేయుచున్న ఎండి. బషీర్ తన సిబ్బందితో వీరంగం సృష్టించడం మనం చూశాం. అయితే అక్కడ ఉన్న ది బులియన్ మర్చంట్ అసోసియేషన్ పట్టణ నాయకులు బలసా ప్రసాద్ ఈ విషయంపై తీవ్రంగా ప్రతిఘటించడంతో తోక ముడుచుకుని వెళ్లినట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ ఈ హెల్త్ అసిస్టెంట్ ఎండి. బషీర్ యొక్క ఆగడాలు రోజురోజుకి మితిమీరిపోతున్నాయని వ్యాపార వర్గాల్లో తీవ్ర అసంతృప్తి ఉంటున్నట్లు విశ్వసనియ సమాచారం. అంతేకాకుండా తను చీరాలలో ఉండి బాపట్ల లో ఉద్యోగరీత్యా సాధారణ బదిలీల్లో భాగంగా కావలికి రావడం, తను గతంలో చీరాలలో ప్రదర్శించిన దౌర్జన్య కాండ.. కావలి లో కూడా ప్రదర్శిస్తే, కావలి పట్టణ ప్రజలు ఊరుకోరని, తమ ఉద్యోగ బాధ్యతలు మాత్రమే నిర్వహించాలని, దీనిపై ఉన్నత అధికారులు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కావలి పట్టణ ప్రజలు వ్యాపారస్తులు కోరుచున్నారు.

# టీడీపీ హయాంలోనే ప్రైవేట్ పాఠశాలలు అభివృద్ధి



## అధికార పార్టీ ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున్ యాదవ్

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** టీడీపీ హయంలోనే ప్రైవేట్ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని అధికార పార్టీ జనరల్ సెక్రెటరీ నీలం మల్లికార్జున యాదవ్ అన్నారు. మండలంలోని శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ నూతన భవనంలోకి (ఆర్ఆర్ బిల్డింగ్) ప్రవేశం పొందిన నేపథ్యంలో నూతన భవనం సముదాయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి నీలం తోపాటు పార్టీ సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్‌రెడ్డి సంయుక్తంగా ప్రారంభోత్సవం చేశారు. స్కూలు హెడ్మాస్టర్ రాధిక, కరస్పాండెంట్ సుధీర్ బాబు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి నీలం మాట్లాడారు. ఎంతో కష్టపడి స్కూల్ వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటున్న యాజమాన్యానికి అభినందనలు తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. స్కూల్ హెడ్మాస్టర్ రాధిక మాట్లాడారు. విద్యతోపాటు క్రమశిక్షణ, అంకితభావం, సమయస్ఫూర్తి, ఆహ్లాదకర వాతావరణము కల్పిస్తూ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వారి నిర్లక్ష్యం..

# బ్యాంకులు చుట్టూ తిరుగుతున్న బాధితులు




**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఈనెల 1వ తేదీ ఎస్‌బీఐ ఇయర్ ప్యానల్ కావడంతో అది తెలియని ఖాతాదారులు పెద్ద సంఖ్యలో ఆరోజు ఫోన్ పేల ద్వారా ట్రాన్సాక్షన్లు జరిపిన పరిస్థితిని ప్రస్తావించుకోవచ్చు. అయితే ఈవిషయం ఎస్బిఐ వారు ఖాతాదారులకు తెలపకపోవడంతో, అలాగే నిర్లక్ష్యం వహించడంతో ఖాతాదారులు రోజూ ఎలాగైతే అవసరాన్ని బట్టి ఫోన్ పే ద్వారా గూగుల్ పేరు ద్వారా ట్రాన్సాక్షన్లు జరుపుకుంటారు. అలాగే ఈనెల 1వ తేదీ కూడా ఏటీఎం, ఫోన్ పే, గూగుల్ పే పనిచేస్తుంది అనే ఉద్దేశంతో చాలామంది వారి వారి ట్రాన్‌జాక్షన్‌ను కొనసాగించారు. అయితే ప్రత్యేకించి ఖాతాదారులకి ఈ విషయం తెలియపరచడంలో ఎస్‌బీఐ శాఖ వారు నిర్లక్ష్య ధోరణి వ్యవహరించినట్లు విమర్శలు వస్తున్నాయి. వీరు ఈ విషయాన్ని ప్రచార మాధ్యమాల ద్వారా తెలియపరచి ఉంటే బాగుండేదేమో అన్న విషయంలో కూడా ఖాతాదారులు చర్చించుకుంటూ ఉన్నారు. ఈ విధంగా ట్రాన్సాక్షన్లు జరిపిన కారణంగా చాలామంది ఖాతాల్లో నగదు డెబిట్ కావడం జరిగింది. తమ నగదు ఈ విధంగా డెబిట్ కావడం వెనకాల కారణం ఏమిటి అన్న కోణంలో బాధితులు సంబంధిత ప్రాంతాలకు సంబంధించిన ఎస్బిఐల చుట్టూ తిరుగుతూ నానా అవస్థలు పడుతూటెన్షన్లు పడుతున్న పరిస్థితులను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించుకోవచ్చు. ఇందుకూరుపేట మేజర్ న్యూస్ విలేఖరి మైపాడు ఎస్బిఐ మేనేజర్ ను ఫోన్లో వివరణకోరగాఆయన వెంటనే స్పందించి ఇలా తెలియజేశారు. చాలామంది ఖాతాదారుల అకౌంట్లో నగదు డెబిట్ అవ్వడం జరిగిందని ఇంకా రెండు రోజుల లోపల వారి వారి ఖాతాల్లో తిరిగి వారికి డెబిట్ అయిన నగదు క్రెడిట్ అవుతుందని స్పష్టం చేశారు. ఏదేమైనా ఎస్బిఐ ఖాతాదారులు హై టెన్షన్ నెలకొందని చెప్పకనే చెప్పవచ్చును. రెండు రోజులలో ఖాతాదారుల అకౌంట్లో నగదు జమవుతుందా లేదా అనే విషయం వేచి చూడాలి మరి.

## కావలికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన వేములపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టడానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికులు వేములపాటి మాధవరావుకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పురస్కార పురస్కారం కళారత్న (హంస) అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉగాది కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలో కావలి పట్టణాన్ని ఒక తల మానికంగా నిలిపిన మాధవరావుకు కావలి నియోజకవర్గం ప్రజలు, మేధావులు వారిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే ఈ పురస్కారానికి సహకరించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని మంగళవారం కలిశారు. అనంతరం ఎమ్మెల్యే అవార్డు అందుకున్న మాధవరావును ఘనంగా సత్కరించి రాష్ట్రంలోనే కావలి నియోజక వర్గాన్ని కావలి నియోజకవర్గ కీర్తి ప్రతిష్టలు కనుబరిచినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాగే రానున్న రోజుల్లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అవార్డు గ్రహీత తో పాటు ఆర్యవైశ్య నాయకులు పోతుగంటి శ్రీకాంత్, శ్రీనివాసులు ఉన్నారు.

## ఉపాధి హామీ పనులు తనిఖీ



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** జాబ్ కార్డున్న ప్రతి కూలీ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఏపీఓ ఆజామ్ ఖాన్ సూచించారు. ఈ సందర్భంగా వరికుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీవో ఆజామ్ ఖాన్ తనిఖీ చేశారు. అనంతరం ఏపీవో ఆజామ్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలి రూ.300 పొందాలని తెలియజేశారు. జాబ్ కార్డుల్లో ఒకరి పేరు మీద మరొకరు రాకూడదని, జాబ్ కార్డులో ఉన్నవారే ఉపాధి పనికి రావాలని, ఉదయం 6గంటల నుంచి 11గంటల లోపు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్,మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువ ఉంటుంది గనుక పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ కూలి పనులకు వచ్చే ప్రతి ఒక్కరూ ఉపాధి వేతనాలు జమ కోసం పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నల్లగొర్ల వెంగళరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## విద్యార్థులచే ఘన సన్మానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలకొండ నందు పని సర్దుబాటు కింద కలిగిరి మండలం నుంచి విచ్చేసిన కాటేపల్లి ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, జలదంకి మండలం నుంచి విచ్చేసిన మహేష్‌కి ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలు ముగించుకున్న విద్యార్థినీ, విద్యార్థులు వారు చేసిన సేవలకు ఘనంగా సత్కరించిరి. పై కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు పోలుబోయిన రమేష్ వారి సేవలను గూర్చి చక్కగా వివరించారు. ముఖ్యంగా వీరు ఇద్దరు సంక్రాంతి సెలవలలో, సెలవదినంలో కూడా పదవ తరగతి విద్యార్థుల కోసం పాఠశాలకు విచ్చేసి చక్కగా వారి వారి సబ్జెక్టుల నందు తర్ఫీదును ఇచ్చి వారి సొంత నిధులతో విద్యార్థినీ విద్యార్థులకు పోషకాహారం అందించి వారిని చక్కగా చదివించి పరీక్షలకు సిద్ధం చేశారని వివరించెను. విద్యార్థిని విద్యార్థులు చేసిన సన్మానంకు లక్ష్మయ్య, మహేష్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఆఫీస్ సిబ్బంది పాల్గొనేను.

ఎమ్మెల్సీగా రెండోసారి

## తిరుమల నాయుడు ప్రమాణ స్వీకారం



**దుత్తలూరు, మేజర్‌న్యూస్ :** రెండోసారి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన బిటి నాయుడుని అసెంబ్లీ హాల్లో మర్యాదపూర్వకంగా కలిసిన ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి, వాల్మీకి సాధికారిక కన్వీనర్ చల్లా ప్రసాద్ ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించి తీపిజ్ఞాపిక అందజేశారు. అనంతరం చల్లా ప్రసాద్ ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఒక్క టిడిపికే సాధ్యమని, అందుకు ఉదాహరణ బిటీనాయుడు లాంటి నాయకులు అని అలాంటి నాయకుడికి రెండోసారి తెలుగుదేశం ప్రభుత్వం ఎంఎల్సిగా ఇవ్వడం బడుగు బలహీన వర్గాలకు చాలా ఆనందకర విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘ యువ నాయకులు మానం ప్రసాద్, వాల్మీకి సోదరులు ఆయన వెంట ఉన్నారు.

# పొలాల్లో రోడ్డు నిర్మాణం చేయకుండా న్యాయం చేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నలభై సంవత్సరాలుగా పట్టాపొంది, పాస్‌బుక్‌లు పొంది సాగుచేసుకుంటున్న భూముల్లో అడ్డంగా రోడ్డు నిర్మించకుండా తమకు న్యాయం చేయాలని వెన్నవాడకు చెందిన బాధితులు కోరుతున్నారు. ఆత్మకూరు మండలం వెన్నవాడలో నలుగురురైతులకు చెందిన పట్టాపొలాల్లో రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించగా బాధితులు అడ్డుకోవడం తోపాటు జగన్నాధం చలమయ్య అనే రైతు జెసిబికి అడ్డంగా పడుకొని నిరసనతెలుపుతూ రోధించసాగగా కాంట్రాక్టర్లు పనులు తాత్కాలికంగా నిలిపివేయడం తెల్సిందే. వారు బుధవారం ఆత్మకూరు ఆర్డీవోను కలిసి తమ పొలాల్లో రోడ్డు నిర్మించకుండా న్యాయం చేయాలని విన్నవించారు. రామస్వామిపల్లి నుండి నల్లగొండ్లవరకు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. అందులో బాగంగా వెన్నవాడవద్ద నలుగురు రైతులకు చెందిన భూముల్లో అడ్డంగా రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ యత్నిస్తుండగా ఆరైతులు అడ్డుచెబుతూ రెండునెలలుగా జరుగుతోంది. జగన్నాధం నర్సింహులుకు 40సంవత్సరాల క్రితం ప్రభుత్వం డిఫారంపట్టాగా 2.50ఎకరాల భూమిని ఇచ్చి పట్టాదార్ పాస్‌బుక్ కూడా మంజూరు చేయగా నాటినుండి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జగన్నాధం చలమయ్య అనే రైతుకుకూడా 40సంవత్సరాల క్రితం 1.75ఎకరాల భూమిని డిఫారంపట్టాగా ఇచ్చి పాస్‌బుక్‌లు ఇవ్వగా సాగుచేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. పసుపులేటి తిరుపాలు, జగన్నాధం బాలమ్మలకు స్వంత పట్టాపొలం 1.5ఎకరాలవంతున అక్కడే ఉంది. ఈనలుగురు రైతుల పొలంలో రోడ్డు నిర్మించేందుకు కాంట్రాక్టర్‌లు యత్నిస్తున్నారు. ఈనలుగురు తమ పాస్‌బుక్‌ల ఆధారాలతో ఇటీవల ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఒక వినతిపత్రం అందజేశారు. తమ పొలాల్లో తమకు ఎలాంటి సమాచారం కానీ, నోటీసుకానీ లేకుండా అక్రమంగా రోడ్డు వేసేయత్నంలో ఉన్నారని, విచారించి తమ పొలాల్లో రోడ్డు వేయకుండా ప్రక్కన వేసేలా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు ఆర్డీవోకు విన్నవించారు. ప్రజోపయోగార్ధం అన్నా తమకు సమాచారం, నోటీసులు ఇవ్వాలికదా, నష్టపరిహారం చెల్లించాలికదా అంటూ వారు తమకు న్యాయం చేయాలని ఆర్డీవోకు మొరపెట్టుకున్నారు. కాగా మంగళవారం ఆర్డీవో, తహశిల్దారు, పిఆర్‌డియి, సిఐ తదితరులు వెన్నవాడకు వెళ్ళి ఆ రైతుల పొలాల్లో రోడ్డు వేసేలా జెండాలు పాతడం, అనంతరం కాంట్రాక్టర్లు జెసిబిలు పెట్టి పొలంలో రోడ్డువేసేందుకు పూనుకోవడం, దాంతో బాధితులు పొలంవద్దకు వచ్చి రోధించడం తెల్సిందే.

### అధికారులు న్యాయంగా వ్యవహరించాలి



జగన్నాధం లక్ష్మమ్మ

అధికారులు తమ గోడును ఆలకించాలని, న్యాయంగా వ్యవహరించాలని వెన్నవాడ సర్పంచ్, బాధితురాలు జగన్నాధం లక్ష్మమ్మ కోరారు. తమకు ప్రభుత్వం డిఫారం పట్టా ఇవ్వగా తమకు హక్కులేదన్నట్లుగా అధికారులు, కాంట్రాక్టర్ పరిగణించడం అత్యంత బాధాకరం, అన్యాయమని ఆమె పేర్కొన్నారు. తాము పేదలమని, తాము సాగుచేసుకుంటున్న పొలంలో ఎలాంటి సమాచారం, నష్టపరిహారం లేకుండా రోడ్డు వేయమని ప్రభుత్వం చెబుతుందా అని ఆమె ప్రశ్నించారు. అధికారులు తమ హక్కు, అనుభవాలను, పొలం కోల్పతున్నామన్న గోడును పట్టించుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టా పొలంపై తమకు హక్కు లేదా, ఎలాంటి సమాచారం లేకుండా అన్యాయంగా, దౌర్జన్యంగా రోడ్డు నిర్మించడం తగునా, ఈపరిస్థితిని అధికారులు పరిశీలించి తగు న్యాయం చేయలేరా అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని లక్ష్మమ్మ కోరారు.

### ప్రత్యామ్నాయం చూపుతామన్న ఆర్డీఓ

### పొలంలో అడ్డంగా రోడ్డు వేయడం అన్యాయం



చలమయ్య

తాను నలబైసంవత్సరాలక్రితం ప్రభుత్వం ఇచ్చిన డిఫారం పట్టాకు పాస్‌బుక్ పొందానని, నాటినుండి పేదనైనా తాను ఆ పొలం సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని పేర్కొన్నారు. తమకెలాంటి సమాచారం లేకుండా తమ పొలం మద్యలో రోడ్డువేయబూనడం అత్యంత అన్యాయంగా ఉందని బాధితుడు జగన్నాధం చలమయ్య పేర్కొన్నారు. మూడునెలల నుండి కాంట్రాక్టర్ తమ పొలంలో రోడ్డువేసేందుకు యత్నిస్తుండగా తాను అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నానని, కానీ మంగళవారం అధికారులు వచ్చి తన పొలంలోనే మార్కింగ్ ఇవ్వగా పనులు ప్రారంభించారని, తాను అడ్డుకోగా తాత్కాలికంగా పనులు నిలిపివేశారని ఆయన పేర్కొన్నారు. కనీసం తమ పొలానికి నష్టపరిహారం కానీ, ప్రతామ్నాయ పొలం కానీ ఇవ్వకుండా దౌర్జన్యంగా రోడ్డు వేసేందుకు యత్నించారని, అధికారులు తమ గోడు పరిశీలించి పొలంలో రోడ్డు వేయకుండా తనకు న్యాయం చేయాలని చలమయ్య కోరారు.

### అధికారులు కనికరించాలి

తాను నలబై సంవత్సరాలుగా హక్కుఅనుభవం కలిగి సాగుచేసుకుంటున్న పొంలంలో అడ్డంగా రోడ్డు వేసేందుకు యత్నించడం అత్యంత బాధాకరమని, తమ గోడును అధికారులు విన్పించుకోవాలని, కనికరించాలని, తనకు న్యాయం చేయాలని బాధితుడు జగన్నాధం నరశింహులు కోరారు. 40సంవత్సరాల క్రితం ప్రభుత్వం డిఫారం పట్టా ఇచ్చిందని, పాస్‌బుక్ కూడా ఇచ్చారని, సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నానని, కనీస సమాచారం, నోటీసులు, నష్టపరిహారం, ప్రత్యామ్నాయ పొలం లేకుండా తమ పొలంలో రోడ్డు వేసేందుకు ప్రారంభించడం అత్యంత అన్యాయంగా, బాధాకరంగా ఉందన్నారు. అధికారులు తమ దయనీయ పరిస్థితిని, రోదనను అర్ధం చేసుకోవాలని, తమ పొలంలో రోడ్డు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని, రోడ్డును ఇతర మార్గంలో నిర్మించుకోవాలని నరశింహులు కోరారు.



బాధితుడు జగన్నాధం నరశింహులు.

# విద్యార్థులను ఇతర పాఠశాలకు తరలించరాదు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండు సమీపంలో ఉన్న ఆదిఆంధ్రాప్రాధమిక పాఠశాల 3, 4, 5 తరగతుల విద్యార్థులను కిలోమీటరు దూరంలో ఉన్న ఎల్‌ఆర్‌పల్లి పాఠశాలకు తరలించే యత్నం ప్రభుత్వం విరమించుకోవాలని ఆ పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆప్రాంత ప్రముఖులు కోరారు. బుధవారం మండల విద్యాశాఖాధికారులు పాఠశాలలో పేరెంట్స్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈపాఠశాల పరిధిలోని 12, 13వార్డుల ముఖ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ స్కూలు పాఠశాల విద్యార్థులను ఇతర పాఠశాలకు పంపే అంశాన్ని వారు వ్యతిరేకించి అభ్యంతరం తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ పాఠశాల విద్యార్థులను ఇతర పాఠశాలకు పంపాలనే ఆలోచనచేయరాదని వారు కోరారు. ఆవాస ప్రాంతాల్లో పాఠవాలలుంటేనే చిన్నారులు బడులకు వెళతారని, దూరం అయితే డ్రాపవుట్స్‌గా మారతారని వారు పేర్కొన్నారు. ఆదిఆంధ్రా పాఠశాల పరిధిలో దాదాపు 1000 దళితవర్గాల కుటుంబాలున్నాయని, ఇలాంటి



చోటనుండి విద్యార్థులను దూరంగా ఉన్న పాఠశాలకు తరలించాలనుకోవడం అనాలోచిత చర్య అని, ఈనిర్ణయం సరైంది కాదని, మున్సిపల్ బస్టాండునుండిప్రధానరహదారిపై ట్రాఫిక్‌లో ఎల్‌ఆర్‌పల్లి స్కూలుకు చిన్నారులు వెళ్ళడం అత్యంత ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. తమ నిర్ణయాన్ని కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారిలకు తెలపాలని వారు కోరారు.

### వైసీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎంప్లాయస్, ఫెంన్షనర్స్..

# విభాగ అధ్యక్షుడుగా మోహన్ రావు ముదిరాజ్

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నూతనంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయస్, ఫెంన్షనర్స్ విభాగ అధ్యక్షుడుగా నియమితులైన కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మకి కృతజ్ఞతలు తెలుపుతూ.. మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ మదన్ మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు (ఆర్‌యస్ఆర్), రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ కె.శ్యామ్‌సింగ్, రూరల్ నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడు సతీష్, బాబు రావు, మస్తాన్ రెడ్డి, మొహమ్మద్ ఇక్బాల్, మురళి యాదవ్, పెంచలయ్య, రంజిత్ కిరణ్, వహీద్, సందాని, జిలాని, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ట్రాఫిక్‌పై ప్రత్యేక కార్యక్రమం : ఆత్మకూరు సీఐ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ట్రాఫిక్‌పై స్థానిక సీఐ గంగాధర్ ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా బుధవారం పట్టణంలో ఎస్ఐ షేక్ జిలానీ, సిబ్బంతితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటో డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాలు జరుగకుండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వివరించే కరపత్రాలను రూపొందించి వాటిని ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ.. ఆటోలను డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని, మితిమీరిన వేగం తగదని, అధికంగా ప్రయాణీకులను ఎక్కించుకోరాదని, రోడ్డుపై ఎక్కడబడితే అక్కడ ఆటోలను నిలుపరాదని సూచించారు. ట్రాఫిక్ నియమావళి పాటించాలని, ప్రమాదాలు జరుగకుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఏదేని ప్రమాదాలు జరిగినపుడు వెంటనే ఆటోల్లో డ్రైవర్లే క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించాలని, లేదా 108 వాహనానికి ఫోన్ చేయాలని కూడా గంగాధర్ సూచించారు. వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ప్రశాంతంగా విధులు నిర్వహించాలని, ముందువాహనాలను క్రాస్‌చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని, ఎదుటి వాహనాలను జాగ్రత్తగా తప్పించాలని ఆయన కోరారు. ఈమేరకు అందరికీ అవగాహన లక్పించేలా రూపొందించిన కరపత్రాలను ఆటోడ్రైవర్లకు, ఇతర వాహానాల డ్రైవర్లకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్ఐ షేక్ జిలానీ, పోలీస్‌సిబ్బంది, పలు వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. పంటి సంరక్షణకు సంబంధించి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో భాగంగా సెన్సివిటీ టూత్ పేస్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రాధ, సిబ్బంది పాల్గొన్నారు.



# లైబ్రేరియన్‌లేని ఆత్మకూరు గ్రంధాలయం

## 15సంవత్సరాలుగా ఇన్‌చార్జ్‌తోనే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లా గ్రంధాలయసంస్థ శాఖా గ్రంధాలయం ఒకటిన్నర దశాబ్దకాలంగా లైబ్రేరియన్ లేకుండానే ఇన్‌చార్జ్ తోనే కొనసాగిస్తున్నారు. 2009లో ఇక్కడ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఏ.గోవిందరెడ్డి రిటైర్ అయ్యారు. నాటినుండి ఓంకారం శ్రీనివాసరాజు అనే లైబ్రేరియన్ మర్రిపాడు, సంగం, ఏఎస్‌పేటల్లో రెగ్యులర్ లైబ్రేరియన్‌గా, ఆత్మకూరు గ్రంధాలయ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రెవిన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గకేంద్రం, వివిద శాఖల డివిజన్‌కేంద్రంగా, మండల కేంద్రంగా కొనసాగుతున్న ఆత్మకూరులో గ్రంధాలయానికి గ్రంధబాంఢాగారి లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తుసాక్ష్యంగా ఉంది. దశాబ్దాలతరబడి ఆత్మకూరు గ్రంధాలయానికి స్వంత భవనం లేకుండా అద్దెభవనం కొనసాగుతుండగా నాలుగేళ్ళక్రితం స్థానిక ఇందిరాగాంధీ మహిళామండలి భవనాన్ని ఆభవ నిర్వాహకులు గ్రంధాలయానికి అప్పగించారు. అయితే లైబ్రేరియన్ మాత్రం ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరాజును కొనసాగిస్తున్నారు. శ్రీనివాసరాజు విధుల నిర్వహణలో అత్యంత చిత్తశుద్ధిగా వ్యవహరిస్తుంటారు. కానీ ఆయనను ఆత్మకూరుకు బదిలీచేయాలని పలువురు కోరుతుండగా ఆత్మకూరు గ్రంధాలయం బిక్యాటగిరిలో ఉందంటున్నారు. డివిజన్ కేంద్రంగా అనేక కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రవేటుపరంగా దాదాపు 30 విద్యాసంస్థలు, అదీగాక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ, గురుకుల తదితర ప్రత్యేక విద్యాసంస్థలుండగా ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏ క్యాటగిరిగా మార్చకపోవడం విశేషం. అదీగాక ఆత్మకూరు గ్రంధాలయంలో వేలకొద్ది అన్ని రకాలు పుస్తకాలున్నాయి. అన్నివర్గాలకు అవసరమైన అన్ని పుస్తకాలున్నాయి. జిల్లాలో దాదాపు 50శాతం లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అటు ప్రభుత్వం, ఇటు జిల్లా గ్రంధాలయసంస్థ లేదా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏగ్రేడ్‌గా మార్చాలని, రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తీర ప్రాంతమైన రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని బుసగాడి పాలెం గిరిజన కాలనీ వాసులకు బుధవారం టీడీపీ సభ్యత్వ కార్డులను స్థానిక టీడీపీ నాయకులు ఆవుల వాసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు గిరిజనులకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా గిరిజన కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సహకారంతో తన వంతు అభివృద్ధి చేయటం జరుగుతుందని తెలిపారు. అనంతరం నోకియా సంస్థ వాలు అందజేసిన వాటర్ బాటిల్ నిత్యవసర సరుకులను స్థానిక గిరిజనులకు అందజేశారు. అనంతరం స్థానిక గిరిజనులు టీడీపీ నాయకులు ఆవుల వాసును సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక



టిడిపి నాయకులు పాల్గొన్నారు.


## తహసిశిల్దార్ కార్యాలయం

# భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నటికో..





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అనేక భవనాలు నిర్మాణంలో అర్ధాంతరంగా నిలిచిపోవడం, వాటిని గురించి పట్టించుకొనకపోతుండడం పరిపాటిగా ఉండగా అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల రెవిన్యూ కార్యాలయ భవనం దశాబ్ధం దాటినా నిర్మాణం పూర్తికాకుండా దర్శనమిస్తుండడం గమనార్హం. ఒకటికాదు, రెండు కాదు ఏకంగా 12 సంవత్సరాల క్రితం శంఖుస్థాపన గావించబడి పనులు ప్రారంభమై శ్లాబ్‌లెవల్‌కు చేరగా ఈనాటికీ పూర్తికాకుండా అదేపరిస్థితి కొనసాగుతోంది. ప్రస్థుతం తహశిల్దారు కార్యాలయం కొనసాగుతున్న బ్రిటిష్‌కాలంనాటి భవనం శిధిలావస్థకు చేరుకోగా వర్షాలకు ఉరుస్తుండడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతుండడంతోపాటు రికార్డులు తడిచిపోతాయనే ఆందోళనతో కొనసాగుతు న్నారు. భవన పైకప్పుకు తార్పాలిన్ పట్టలు కప్పుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నారు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామాత్యులు ఆత్మకూరు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రోడ్లు, భవనాలు, సంస్థలు, వంతెనలు తదితరాలను సాధించారు. అందులోభాగంగా ఆత్మకూరు మండల రెవిన్యూ కార్యాలయ ఆవరణలో తహశిల్దారు కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, సబ్‌ట్రెజరీ భవనాల నిర్మాణాలకు 3కోట్ల రూపాయలను ఆనం రామనారాయణరెడ్డి మంజూరు చేయించి అప్పటి రెవిన్యూ మంత్రి




ఎన్.రఘువీరారెడ్డిని రప్పించి శంఖుస్థాపనలు గావించారు. కాగా ట్రెజరీ కార్యాలయం తమ శాఖనిధులు సాధించుకొని భవనం నిర్మించుకొని శిధిలమైన భవనం నుండి నూతన భవనంలోకి మారారు. రెవిన్యూ డివిజన్ కార్యాలయ భవనం నిర్మాణం నిలిచిపోయిఉండగా ఏడాదిన్నర క్రితం అప్పటి కలెక్టర్ చొరవతీసుకొని పనులు పూర్తిచేయించి ప్రారంభోత్సవం గావించి ఆర్డీవో కార్యాలయాన్ని నూతన భవనంలోకి తరలించారు. ఇక తహశిల్దారు కార్యాలయ భవనం మాత్రం అలాగే శ్లాబ్‌లెవల్‌లో దర్శనమిస్తోంది. అయితే ఈ ఈదపా మళ్ళీ ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడం, రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రిగా కొనసాగుతుండడం జరగ్గా ఆయన ఈ భవనాన్ని పరిశీలించి తాను ఆనాడు మంజూరు చేయించి ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమని పేర్కొంటూ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంకా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందిపడుతూ ఆందోళన చెందుతున్న పరిస్థితిని గమనించి ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేయాలని, రామనారాయణరెడ్డి ఎంతో శ్రద్ధతో నిధులు సాధించిన భవనాన్ని పూర్తిచేసి ఆయన సంకల్పానికి సార్ధకత చేకూర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

# ప్రసన్న పరామర్శ



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** విడవలూరు మండలం, దండిగుంట గ్రామానికి చెందిన వైస్సార్సీపీ నాయకులు బెల్లంకొండ శ్రీధర్ మాతృమూర్తి బెల్లంకొండ సులోచనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. బుధవారం ఆమె పెద్దకర్మలో పాల్గొన్న కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆమె చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరు సాగేదెలా?

## పంట కాలువల్లో దట్టంగా జమ్మూ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలోని పంట కాలువల దుస్థితి కడు దుర్భరంగా ఉంది. కాలువలలో దట్టంగా గుర్రపు డెక్క, జమ్మూ పేరుకొని చివరి ఆయకట్టుకు సాగునీరు అందలేని పరిస్థితి ఏర్పడింది. కేతామనేరు వాగు, కొమ్మలేరు వాగు,ఉత్తర కాలువకు అనుసంధానంగా ఉన్న పలు మేజర్, మైనర్ పంట కాలువలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఉపాధి హామీ పనులను చేపట్టి పంట కాలువల దుస్థితిని సాగునీటిపారుదలకు అనుకూలంగా ఉండేలా మార్చాలని రైతాంగం కోరుతున్నారు.

# సయ్యద్ సలీం పార్ధీవ దేహానికి ఆనం నివాళి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ నియోజకవర్గం పరిధిలోని 31వ డివిజన్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సయ్యద్ సలీం స్వర్గస్తులైనారు. వారిపార్ధీవ దేహానికి నెల్లూరులోని రామకోటి నగర్ వారి నివాసం నందు నివాళి అర్పించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, సలీం కుటుంబానికి అల్లా మనోధైర్యం కలింగించాలని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గం వైసీపీ నాయకులు, 31వ డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోమును అభినందించిన అల్లంపాటి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** శాసనమండలి సభ్యులుగా ఎన్నికైన బిజెపినేత సోము వీర్రాజును ఆత్మకూరుకు చెందిన బిజెవైఎం రాష్ట్ర నాయకుడు అల్లంపాటి సాంబశివారెడ్డి అభినందించారు. వీర్రాజు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బుధవారం ఆయనను కలిసిన సాంబశివారెడ్డి శాలువా, పుష్పగుచ్ఛంలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు విశేష సేవలందించాలని, బిజెపి బలోపేతానికి ప్రత్యేకంగా కృషిచేయాలని సాంబశివారెడ్డి వీర్రాజును కోరారు.

# ఆప్రాన్ పనులకు బిల్లుల శాపం

- రూ.5.7 కోట్ల పెండింగ్ బకాయిలు
- నేటికీ 27శాతం మాత్రమే పనులే పూర్తి
- పునః ప్రారంభానికి గుత్తేదారు నిరాశక్తి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల ప్రాజెక్టు వద్ద జరుగుతున్న ఆఫ్రాన్ పునర్నిర్మాణ పనులకు ఆది నుండి బిల్లుల మంజూరు జాప్యం శాపంగా మారింది. పెండింగ్ బకాయిలు చెల్లిస్తేనే పనులు పున ప్రారంభం చేస్తామని సదరు కాంట్రాక్టర్ అధికారులకు తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. 2022 మార్చి 9న గత వరదలకు దెబ్బతిన్న ఆఫరాన్ ప్రాంతంలో పనులు ప్రారంభం అయ్యాయి. ఆపై జిల్లా కేంద్రంలో ఐఏబి (సాగునీటి సలహా మండలి సమావేశం) సెప్టెంబర్‌లో జరిగింది. జలాశయానికి వరదలు వచ్చేనాటికల్లా 50శాతం పనులు పూర్తి అయ్యేలా యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ ఉండాలని సమావేశంలో తీర్మానించారు. పనులను 2024 మార్చి నాటికి పనులు పూర్తి కావాలని జిల్లా అధికారులు గుత్తేదారుకు పక్కా ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రారంభంలో పనులు వేగంగా సాగినప్పటికీ ఆనాటి వైసిపి ప్రభుత్వం బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. పనుల నిర్వహణలో అప్పటి ప్రభుత్వం నుంచి బిల్లుల మంజూరులో సహకారం కొరవడింది.ఆపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పనుల పున ప్రారంభంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. భాగంగా నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని జలాశయానికి ఆహ్వానించి పనుల తీరును క్షేత్రస్థాయిలో వివరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాక బిల్లులలో ఆలస్యం ఉండదని ప్రాజెక్టును సందర్శించిన మంత్రి కాంట్రాక్టర్‌కు హామీ ఇచ్చారు. ఆ హామీతో సదరు గుత్తేదారు మరల పనులను ప్రారంభించాడు. 2025 ఆగస్టు 31 నాటికల్లా పనులు పూర్తికావాలని గతంలో ఉన్న గడువును పొడిగించడం జరిగింది. అయితే బిల్లుల మంజూరులో మరల కూటమి ప్రభుత్వం నుండి గతంలో లాగా సహకారం లోపించింది. నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటివరకు చేపట్టిన మొత్తం కేవలం 27 శాతం మాత్రమే కావడం గమనార్హం. 5.7 కోట్ల రూపాయలు బిల్లులు రావాల్సి ఉంది. డైవర్షన్ కెనాల్‌లోని వాల్ నిర్మాణం పీసీసీ పనులు పూర్తికాగా కేవలం ఆర్‌సీసీ పనులు జరగాల్సి ఉంది. లెఫ్ట్ ఫ్లడ్ బ్యాంకు వాల్, ప్రాజెక్టు ముంగిట ఉన్న మాస్ కాంక్రీట్ పనులు ఆగిపోయాయి. బిల్లులు చెల్లిస్తేనే పనులు చేసే పరిస్థితి అని గుత్తేదారు అధికారులకు తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా ఇదే విషయంపై గుత్తేదారుకు ప్రాజెక్టు ఉన్నతాధికారులకు మధ్య చర్చ సాగుతోంది. పెన్నా డెల్టాకు సాగునీరు అందించేందుకు ముఖ్యమైన డైవర్షన్ పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఆఖరి దశలో ఉన్న పనులను బిల్లుల లేమితో పూర్తి చేసే పరిస్థితి కాన రావడం లేదు. నేపథ్యంలో ఆయకట్టు రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా కీలకమైన పనుల కొనసాగింపులో ప్రభుత్వాలు తమ చిత్తశుద్ధిని కనపరచడం లేదన్న ఆగ్రహం సర్వత్ర వ్యక్తమవుతోంది.

# బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధించండి

## అదనపు కమిషనర్ నందన్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధించాలని, పబ్లిక్ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తుల నిషేధంపై పోస్టర్లను ప్రచారం చేయాలని పారిశుద్ధ్య విభాగం అధికారులు సిబ్బందిని అదనపు కమిషనర్ వై ఓ నందన్ ఆదేశించారు. పారిశుద్ధ్య విభాగం వారాంతపు సమీక్షలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, బీడీ ఇతర ఉత్పత్తులను వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, 18 సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్న చిన్నారులకు పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధించినట్లు అదనపు కమిషనర్ తెలిపారు. అదేవిధంగా పాఠశాలలకు సమీపంలో 100 యార్డుల దూరంలోపు ఎలాంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరపడాన్ని పూర్తిగా నిషేధించామని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాల ద్వారా మాత్రమే వ్యర్థాలను సేకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు.ప్రధాన రోడ్లను ఎండ్ టు ఎండ్ వరకు శుభ్రం చేయాలని, రోడ్ల మూలల్లో, డివైడర్ల చివరన వ్యర్థాలు, మట్టి, మురుగు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలు, ఇసుక బస్తాలు, విద్యుత్, ఇతర తీగలు రోడ్లపై, వీధుల్లో ఉండకూడదని, సంబంధిత ప్లానింగ్ విభాగం వార్డు సచివాలయ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లి క్లియర్ చేయించాలని సూచించారు. రోడ్ల వెంట చెత్త కుప్పలు, వ్యర్థాలు ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పాత వస్తువులు, నిరుపయోగంగా ఉన్న వాహనాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రమాదకరంగా ఉన్న వీధి కుక్కలను పట్టుకొని శాస్త్ర చికిత్స కేంద్రానికి తరలించాలని, రోడ్లపై సంచరించే పశువులను గుర్తించి వాటిని గోశాలలకు తరలించి సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని సూచించారు.డివిజన్ల వారీగా ఉన్న ఖాళీ స్థలాల వివరాలు, అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఒక్క షాపును పన్ను పరిధిలోకి తీసుకొని వచ్చి ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై తనిఖీలు నిర్వహించి దుకాణదారులపై భారీ జరిమానాలు విధించాలని, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజలకు అవగాహన పెంచాలని సూచించారు.ఫ్లోర్ పాయింట్లను పూర్తిగా తగ్గించివ్యర్థాలు వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా దోమల నిర్మూలనకై క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయడం, ఆయిల్ బాల్స్ పిచికారి, గంబుజియ చేప పిల్లలను కాలువల్లో వదిలిపెట్టడం తదితర కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని అదనపు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్ జిజియా బాయి, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు

# ఉద్యోగోన్నతి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సీవీఎస్ కిరణ్, టి.రవి కుమార్, ఎల్.పి.వర ప్రసాద్‌లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ సూర్యతేజ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

### పరిపాలన సౌలభ్యం కోసం

# సూపరింటెండెంట్‌ల బదిలీలు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిపాలన సౌలభ్యం కోసం, వివిధ విభాగాల పనితీరును క్రమబద్ధీకరించడానికి పలువురు సూపరింటెండెంట్‌లను బదిలీలను చేపట్టినట్టు కమిషనర్ సూర్యతేజ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. వి.పద్మావతి సూపరింటెండెంట్‌ను ఇంజనీరింగ్ సెక్షన్ నుంచి ఎలక్షన్ విభాగానికి, ఎ.వి.సులోచన సూపరింటెండెంట్‌ను పబ్లిక్ హెల్త్ విభాగం/ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మెప్మా నుంచి రెవెన్యూ విభాగానికి, కె.పద్మ సూపరింటెండెంట్‌ను టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి హౌసింగ్ విభాగానికి, మునిరత్నం సీనియర్ అసిస్టెంట్‌ను జిఎస్‌డబ్ల్యూఎస్ విభాగం నుంచి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ టౌన్ ప్లానింగ్ విభాగానికి, పి.శ్రీనివాసులు సూపరింటెండెంట్‌ను రెవెన్యూ విభాగం నుంచి పబ్లిక్ హెల్త్ విభాగానికి/ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా మెప్మా విభాగానికి, బి.విజయ సీనియర్ అసిస్టెంట్‌ను ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ విభాగం నుంచి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ జిఎస్‌డబ్ల్యూఎస్ విభాగానికి, ఎన్.నరేంద్ర సూపరింటెండెంట్‌ను కమాండ్ కంట్రోల్ విభాగం నుంచి ఇంజనీరింగ్ విభాగానికి, జి.బాల సుబ్రహ్మణ్యం సీనియర్ అసిస్టెంట్‌ను హౌసింగ్ విభాగం నుంచి మెప్మా విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీలు చేస్తూ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు.

# తనపై దుష్ప్రచారం ఆపండి

- రాష్ట్ర వైసీపీ కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్పష్టం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తాను అప్రూవర్‌గా మారినట్లు కొన్ని ఎల్లో చానెల్స్‌లో దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నేటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేసులు పెడితే భయపడి వెనక్కి తగ్గే రకం కాదని తాను ఎప్పటికీ అధినేత జగన్‌తోనే ఉంటానని వెల్లడించారు. మాజీ మంత్రి కాకాణి మీద నమోదైన అక్రమ కేసులో నన్ను ఏ1 గా చేర్చారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న నన్ను నిందితుడిగా చేర్చితే 24వ తేదీ నాకు బెయిల్ వచ్చిందని వివరించారు. రస్తుం మైన్స్ మీద మైనింగ్ అధికారులకే క్లారిటీ లేదని చెప్పారు. ఈ కేసులో ఉన్న వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులకి మైనింగ్ డీడీ షోకాజ్ నోటీసులు ఇచ్చి 7కోట్ల 56 లక్షల పెనాల్టీ వేశారని పేర్కొన్నారు. ప్రస్తుత మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ తన పేరును కూడా చేర్చి నా మీద పోలీసులకు పిర్యాదు చేశారని తెలిపారు. ఓనర్ కూడా లేని మైన్స్‌లో అక్రమాలు జరిగాయని మాపై కేసు పెట్టడం దారుణమన్నారు.

# నర్సింగ్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని పాత ఊర్లోని శ్రీ లక్ష్మీనిష్ఠ మెడికల్ సైన్స్ కాలేజీలో జరిగిన బిఎస్సి నర్సింగ్ విద్యార్థుల జ్యోతి ప్రజ్వలన, ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటిగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ.. నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వైద్య సేవలు అందించాలని, వృత్తిలో పూర్తి న్యాయం చేయాలని కూడా వారిని కోరారు. అలాగే నర్సింగ్ కోర్స్ తీసుకున్న విద్యార్థులను అభినందించారు. అంతేకాకుండా వైద్య సేవ చేయడం దేవుడిచ్చిన వరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల సిబ్బంది టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.